**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేదీ : నవంబరు 27, 2016.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : పరిశ్రమల కాలుష్యం భారీ నుండి తణుకు పట్టణాన్ని, గోస్తనీ నదిని కాపాడాలని కోరుతూ...**

**ఆర్యా!**

పచ్చదనంతో అలరారే తణుకు పరిసర ప్రాంతాలకు కాలుష్యం ఆవరించింది. ఈ ప్రాంతం పరిశ్రమలు వెదజల్లుతున్న విషపూరిత పదార్థాల వలన స్వచ్ఛమైన సాగు, త్రాగునీరు కలుషితమవుతున్నాయి. గోస్తనీ నదీ జలాలు ఇప్పటికే త్రాగడానికి పనికిరాకుండా పోయాయి. కాలుష్యం ఇలానే కొనసాగితే రానున్న కాలంలో భూములు పంటల సాగుకి కూడా పనికి రాకుండా పోయే ప్రమాదముంది. పరిశ్రమలు యదేచ్ఛగా పారిశ్రామిక వ్యర్థాలను గోస్తనీ నదిలోకి, ఇతర సాగునీటి కాల్వలలోకి వదలడం వలన నదీ జలాలు కాలుషితమవుతున్నాయి. ఈ కలుషిత నీరువల్ల ప్రజలు రోగాలపాలవుతున్నారు. దగ్గు, ఆయాసంలాంటి ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మరోగాలు క్యాన్సర్‌లు విజృంభిస్తున్నాయి. ఒకవైపు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బదీస్తూనే మరోవైపు వారి ఉపాధిని సైతం దెబ్బదీస్తుంది. పరీవాహక ప్రాంతంలో పంటల దిగుబడి క్రమేపి తగ్గిపోతున్నది. తణుకులో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. ఒకప్పుడు స్వచ్ఛతకు మారుపేరైన గోస్తనీ నది కాలుష్యమయమవడంతో లక్షకు పైగా జనాభాకల్గిన తణుకు పట్టణంలోనూ, చుట్టు ప్రక్కల గ్రామాల్లోనూ ప్రజలు త్రాగునీరు కొనుక్కొని త్రాగాల్సిన దుస్థితి నెలకొనుంది. తణుకు పట్టణ త్రాగునీటి అవసరాలను రక్షిత మంచినీటి పథకం తీర్చలేక పోతుంది. కనీసం రోజువారీ అవసరాలకు వాడుకోవడానికి కూడా పనికిరానంతగా భూగర్భజలాలు కలుషితమయ్యాయి.

కాలుష్య నియంత్రణ బోర్డు లెక్క ప్రకారమే 21 పరిశ్రమలు కోటి 50 లక్షల లీటర్ల వ్యర్థ జలాలను నేరుగా డ్రయిన్లలోకి వదులుతున్నాయి. వాటిలో తణుకులోని ఆంధ్ర షుగర్స్‌కి చెందిన మూడు ఫ్యాక్టరీలు, మండపాకలోని జయంతి బోర్డ్స్ లిమిటెడ్, ఆకుల బోర్డ్స్ లిమిటెడ్, శ్రీబుచ్చి–ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, కోస్టల్ ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్, పైడిపర్రు లోని ఫ్లూటెక్ ల్యాబ్స్ లిమిటెడ్ మొదలగు పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమలు యధేచ్ఛగా వదులుతున్న వ్యర్థాలతో తణుకు పరిసర ప్రాంతాలు దుర్గంధపూరితమయ్యాయి.

గోస్తనీ నది గొల్లల కోడేరు వద్ద యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తోంది. భీమవరం సమీపంలోని 17 పరిశ్రమల వలన యనమదుర్రు డ్రెయిన్ మురికి కూపంగా మారింది. ఈ కాలుష్యం వలన తణుకు చుట్టు ప్రక్కల వున్న 11 గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రాణాంతకంగా మారాయి.

..... రెండవ పేజీ

ప్రైవేటు పరిశ్రమలు యధేచ్ఛగా లక్షల లీటర్ల వ్యర్థాలను డ్రెయిన్‌లోకి వదులుతుంటే వాటిని అరిట్టాల్సిన ప్రభుత్వం మౌనంగా వుండడమేగాక సాక్షాత్తు తణుకు మున్సిపాలిటీనుండి 70 లక్షల లీటర్ల టాయిలెట్ మురుగును కూడా గోస్తనీ కాలువలోకి వదులుతున్నారు. చట్టరీత్యా టాయిలెట్స్ వాటర్‌ను శుద్ధి చేసిన అనంతరమే కాలువల్లోకి మళ్ళించాలి. కానీ తణుకు మున్సిపాలిటీ నేరుగా కాలువల్లోకి వదులుతుంది. ఒకవైపు స్వచ్ఛభారత్ అంటూ ప్రచారం చేస్తూ కాలువల్లోకి మురుగు వదలడం తీవ్ర తప్పిదమవుతుంది.

ఫ్యాక్టరీలు ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసి వ్యర్థాలను శుద్ధిచేసిన అనంతరమే బయటకు విడుదలయ్యేలా చేయాల్సిన కాలుష్య నియంత్రణా బోర్డు, ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. పైగా పరిశ్రమలనే యాక్షన్ ప్లాన్ కోరడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రస్తుత పరిశ్రమలకు, స్థాపించబోయే పరిశ్రమలకు ఎవరూ వ్యతిరేకం కాదు. కొత్తగా కాలుష్య రహిత, వ్యవసాయ – గ్యాస్ ఆధారిత పరిశ్రమలు రావాలి. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. అయితే పరిశ్రమల పేరుతో అడ్డగోలుగా ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకోవడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు విషపూరిత కాలుష్యాన్ని వెదజల్లి, పారిశ్రామిక వేత్తలకు కోట్ల లాభాలు కట్టబెట్టేలా ప్రభుత్వ విధానాలు వుండడం సహించరానిది. ప్రజల ఆరోగ్యానికి, పరిసరాలకు హాని చేయని పరిశ్రమలు కావాలి. కాలుష్యాన్ని నియంత్రించి ప్రజల ప్రాణాలను, స్వచ్ఛమైన సాగు, త్రాగునీటి వనరులను పరిరక్షించడం ప్రభుత్వాల, ప్రజా ప్రతినిధుల బాధ్యత. కానీ దురదృష్టవశాత్తు ఈ కాలుష్యాన్ని నివారించడానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంలేదు.

ఈ నేపథ్యంలో తణుకు పట్టణం మరియు పరిసర 11 గ్రామాల ప్రజల ఆరోగ్యాలను కాపాడడానికి ఆ ప్రాంతంలో పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యాన్ని నివారించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

*డిమాండ్స్ :*

*1. తణుకులో పరిశ్రమల కాలుష్యాన్ని ట్రీట్‌మెంట్ చేసిన తర్వాతే కాలువల్లోకి వదిలేలా చర్యలు తీసుకోవాలి.*

*2. కాలుష్యకారక పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి.*

*3 తణుకు మున్సిపాలిటీ టాయిలెట్ల మురుగునీరు ట్రీట్‌మెంట్ చేసిన తర్వాత కాలువల్లోకి వదలాలి.*

*4. గోస్తనీ నది ప్రక్షాళన తక్షణమే చేపట్టాలి.*

*5 ప్రజలందరికి మున్సిపాలిటీ ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేయాలి.*

*అభివందనములతో...*

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి